


# మినీకథావీధి

**రామం, రాజు, రవి ఒకే ఆఫీసులో పని చెయ్యడమేకాక. బ్రహ్మచారులు కనుక ఒకే పోర్షన్లో సహజీవనం చేస్తున్నారు**

## పారిన పాచిక



ఆ రాత్రి హోటల్లో భోజనం ముగించుకుని, రోడ్లు కాస్త సర్వేచేసి తొమ్మిది గంటల ప్రాంతంలో యిల్లు చేరుకున్నారు. బట్టలు మార్చుకుని వొకడు, రేడియో వింటూ మరోడు, వుత్తరాలు రాసుకుంటూ ఇంకోడు,పుస్తకం చదువుకుంటూ కూర్చున్నారు. ఆ ముగ్గురూ కూడా స్మోకర్లే కావడం ఒక విశేషం.

ఆఖరు సిగరెట్టు ముట్టించి, పెట్టె అవతల విసిరేసిన రామానికి మరో అరగంటకల్లా యింకోసిగరెట్టు కాల్చాలనిపించింది. తన దగ్గర లేవు కనుక మిత్రుల మీద ఆధారపడాలని నిశ్చయించుకుని-

"ఒరేయ్ రాజూ!.... ఓ సిగరెట్టు ఇలా చదివించుకోరా...." అన్నాడు.

"సారీ బ్రదరూ! నా దగ్గరున్నవిరెండే. ఒకటి రేపు ఉదయమే కావాలి. మరోటి ఇంకాస్సేపట్లో తాగెయ్యాలి .... తనకు మాలిన ధర్మం లేదుకదా!....కనుక...." అంటూ తన అశక్తతని వెల్లడించాడు రాజు.

నాలుక దురదని అణుచుకోలేని రామం రవివైపు తిరిగాడు సిగరెట్టుకోసం చెయ్యి సాచాడు.

రవి అన్నాడు :

"నా దగ్గర అయిదు సిగరెట్లు వున్నాయిరా! నీతో అబద్ధం ఎందుకు చెప్పాలి? కానీ నీకు ఇవ్వాలంటేనే బాధగా వుంది. ఒక్కొక్కదాని ధర పావలా. ప్రతి బడ్జెట్‌లోనూ ఈ సిగరెట్ల ధర పెంచకుండా వుండలేకపోతున్నారు ఆర్థికశాఖామాత్యులు. అందుకే మొన్న బడ్జెట్ తర్వాత నిర్ణయించుకున్న దేమిటంటే- ఒకళ్ళకి సిగరెట్లివ్వరాదు అని."

వాడి లెక్చర్‌కి ఒళ్ళు మండిపోయింది రామానికి.

భరించక తప్పదు. తనిప్పుడు వాడి మీద ఆధారపడి వున్నాడు.

అందుకే మరోసారి బ్రతిమాలాడు. ఫలితం శూన్యం.

రామానికి మాత్రం అనీజీగా వుంది. పోనీ వెళ్ళి కొనుక్కుందామా అంటే షాపులన్నీ ఇంటికి దూరం. కనీసం పావుగంట నడక.

చేసేదేమీ లేక ఊరుకున్నాడు.

మరో పావుగంట గడిచాక మెరుపులా ఆలోచన వచ్చింది రామానికి.

"ఒరేయ్ రవీ?.... నిన్నోటి అడగాలని మర్చిపోయాను" అన్నాడు.

"ఏమిటి?" అన్నాడు పుస్తకం లోంచి తల ఎత్తకుండా.

"నాకో అయిదు వందలు అప్పు కావాలి. ఎలాగైనా సర్దరా...."

"నేనా?...."

"అవున్రా. మా నాన్న దగ్గర్నుంచి సాయంత్రం ఉత్తరం వచ్చింది. మా తమ్ముడ్ని కాలేజీలో చేర్పించాలట. నీ అప్పు నెమ్మదిగా తీరుస్తాను. కాదనకు.." అన్నాడు రామం పరిస్థితి వివరిస్తూ.

"ఒరేయ్....నా పరిస్థితి. జీతం, బాధ్యతలు—అన్నీ తెల్సిన నువ్వు ఇలా నన్ను అడగటం బాగుందా? నెలకొక్క పైసా కూడా మిగుల్చుకోలేని నేను నీకు ఇంత అప్పు ఎలా ఇవ్వగలనురా...." అన్నాడు రవి.

"ఏమిటోరా....నీ ధోరణి అసలు బాగోలేదు. ఇందాకా సిగరెట్ అడిగితే ఇవ్వనన్నావు. ఇప్పుడు అప్పు అడిగితే లేదంటున్నావు. నేను ఏదిఅడిగినాకాదనేస్తున్నావేమిట్రా? నా కసలు ఏమీ ఇయ్యకూడదని నిర్ణయించుకున్నావా?...." అన్నాడు బాధగా రామం.

"ఛఛ....అదేం కాదురా!.... అలాంటి నిర్ణయం ఏదో చేసుకున్నానని అనవసరంగా అపార్థం చేసుకుంటున్నావు. నీ ఊహలు తప్పు అని నిరూపించడం కోసం నీకు సిగరెట్ ఇస్తాను తీసుకో.... కాల్చుకో.... అంటూ ఓ సిగరెట్ ఇచ్చాడు. తనోటి తీసుకొని ఒకే అగ్గిపుల్లతో రెండూ వెల్గించాడు.

నాలుక దురద తీరిన రామం రిలీఫ్‌గా సిగరెట్ కాల్చసాగాడు.

తనకు అవసరం లేకపోయినా సిగరెట్ లాగడం కోసం అప్పు అడిగాడు.

అయిదు వందల అప్పు ముందు సిగరెట్ చిన్నదికదా!

రామానికి తమ్ముడంటూ ఎవ్వరూ లేరని ముందే తెల్సిన రాజు అతని పాచిక అర్థం అయినట్లుగా సన్నగా నవ్వుకున్నాడు.

పాపం రవి మాత్రం, అప్పు ఇచ్చే దారుణ పరిస్థితి తప్పినందుకు సంతోషిస్తూ సిగరెట్ పొడుగుని తగ్గించసాగాడు.


— పాలకూర సీతాలత

---

**రాజారావులో ఓర్పు నశించింది, ఆవేశం పెరిగింది, అంతరాత్మ మాత్రం "ఆవేశపడొద్దు ; ఇక్కడే ఏర్ కండిషన్డ్ హాల్లో హాయిగా వుంది, ఆలస్యం అవడంవల్ల నీకేం నష్టంలేదని వారించింది.**

ఒక విధంగా అంతరాత్మ మాటలు నిజమే. అయినా అభిమానం అడ్డొచ్చి రాజారావు కోపం తగ్గలేదు ఎదురుగుంగా కేష్ కౌంటర్‌లో కృష్ణవేణి గొంతు కోయిల స్వరంలా ఒక్కొక్క టోకన్ నంబరు పిలుస్తున్నప్పుడు తను ఓడిపోతున్నట్లనిపించింది రాజారావుకు. వస్తున్న కోపాన్ని అణచుకోలేక కేష్ కౌంటర్‌కేసి నడిచాడు తన టోకన్ నంబరుచెప్పి "వచ్చిందా" అని అడిగాడు.

# ఓర్పు



"రాలేదు" అంది కృష్ణమ్మ. అంతే కాదు. మరో పది నిమిషాలవుతుందని హెచ్చరించిందికూడా మళ్ళీ కూలబడ్డాడు రాజారావు పది నిమిషాలయింది. పావు గంటయింది. రద్దీ ఎక్కువగా వుంది బ్యాంకులో. అంత గొడవలోకూడా కృష్ణవేణి గొంతు మృదువుగా, స్వర బద్ధంగా వినబడుతూంది మరో అరగంట అయింది. ఈసారి గట్టిగా అడిగాడు రాజారావు.

"ఇంకాఎన్నిగంటలు కూర్చోవాలి".

కృష్ణమ్మ మొహం కొంచెం నల్ల బడింది.

"అబ్బే! మరో పది నిమిషాలు. అంతే - ఆర్ యు ఇన్ ఎ హర్రీ" అడిగింది కృష్ణవేణి.

"అరగంట క్రితం పది నిమిషా లన్నారు - ఊరుకున్నాను - మళ్ళీ పది నిమిషాలంటున్నారు. ఇలా ఎన్ని అర గంటలు".... రాజారావు మాట పూర్తవక ముందే:

"మిష్టర్? మిమ్మల్ని కూర్చోబెట్టడం వల్ల మాకు ఒరిగేది ఏంలేదు. మీ టోకన్ వస్తే పిలుస్తాం. మా మీద కోప్పడి లాభం లేదు" సన్నగా, మెత్తగా దులిపింది కృష్ణమ్మ.

"ఎందుకు మాట్లాడరు? కష్టమర్స్ డబ్బుతో జీతాలు తీసుకుంటూ మండిపడే గతి కొచ్చింది బ్యాంకులగతి. మా పాపం అది" తన ఆవేదన వెళ్ళగక్కాడు రాజారావు. చాలాసేపు వెయిట్ చేస్తున్న మరి కొందరు రాజారావుతో శ్రుతి కలిపారు. "బ్యాంకులు చెడిపోయాయన్నాడు" ప్రభుత్వాన్ని తిట్టారు. బ్యాంకు సిబ్బందికి, కష్టమర్స్‌కు మధ్య ఘర్షణ పెరిగింది. పెద్ద పెద్ద తిట్లు రెండు వైపుల వాళ్ళు ప్రయోగించారు. కొందరు శాంతి కాముకులు ఇరు పక్షం వాళ్ళని ఓదార్చి మళ్ళీ వాతావరణాన్ని చల్లబరిచారు. నిశ్శబ్దంగా వున్న బ్యాంకులో కృష్ణవేణి గొంతు మళ్ళీ మృదువుగా వినబడుతూంది.

ఎదురుగుండా కూర్చున్న రాజారావును అడిగింది జయశ్రీ "మీ టోకన్ నంబరు."

వినయంగా "పంతొమ్మిది" అంటూ టోకన్ అందించాడు రాజారావు

టోకన్ కేసి పరీక్షగా చూసి. రాజారావు కేసి ఎగదిగా చూసింది జయశ్రీ. "ఆర్ యు కన్‌ఫ్యూజ్డ్" అడిగింది.

"ఏం" అడిగాడు రాజారావు.

"మీ టోకన్ నంబరు అరవై ఒకటి పంతొమ్మిదనుకుని మా మీద కోప్పడకండి - నిజంగానే అరగంటవుతుంది" అంది జయశ్రీ - "ఒకటో తారీఖు కదా" రద్దీకి సంజాయిషీ కూడా జతచేసింది.

అప్పుడు అర్థమైంది రాజారావుకు, తను చెక్ ఇచ్చినప్పుడు చెక్ వెనుక 61 అని రాసిన నంబరు బల్లకు ఇటువైపు నుంచి చూసిన తనకు 19లా కనిపించింది. ఎంతకీ తన టోకన్ పిలవకపోవడంతో ఓర్పు నశించింది.

మళ్ళీ సీటులో కూర్చోబోతూ కేష్ కౌంటర్ కేసి చూసిన రాజారావుకు ముసి ముసి నవ్వులు నవ్వుతూ కనిపించింది కృష్ణవేణి.

ఆ నవ్వు తన అసమర్థతకో - లేక ఓర్పు లేకపోవడానికో అర్థంకాలేదు రాజారావుకు.

—ఉప్పద్రష్ట సాయి

